క్లుప్తంగా

ఆర్టీసీ కార్గోలో ముత్యాల తలంబ్రాలు

మధిర: టీఎస్ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలను నేరుగా భక్తులు పొందవచ్చని ఆర్టీసీ మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... భక్తులు కార్గో సర్వీస్ కేంద్రాల ద్వారా రూ.116 రూపాయలు చెల్లించి ముత్యాల తలంబ్రాలను పొందవచ్చన్నారు. మధిర డిపో పరిధిలోని మధిర, వైరా, తల్లాడ, ఎర్రుపాలెం, మీనవోలు కార్గో కేంద్రాలలో తలంబ్రాల కోసం బుక్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9154298584 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పుస్తకాల పంపిణీ

కారేపల్లి: ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ తెలంగాణ సాస్ సేఫ్టీ క్లబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నానునగర్ గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్ఎం కేలోతు రాములు, ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో బ్యాగులు..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో గురువారం సర్పంచ్ మారెళ్ల మమత కుమారుడు రామకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాల్లో 150 మంది విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ మేరకు చిన్నారుల మధ్యనే కేక్ కట్ చేశారు. మారెళ్ల మల్లిఖార్జున్, మారెళ్ల లక్ష్మణ్‌రావు, ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణకుమారి, సూపర్‌వైజర్ హనీబున్నీసాబేగం, ఎంపీటీసీ గోవిందు విజయమ్మ, ఉపసర్పంచ్ గోవిందు భాగ్యమ్మ, కార్యదర్శి వేణు, హైస్కూల్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు రమేష్, సరోజినీ, ఉపాధ్యాయులు మాదినేని నరసింహారావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాబా ఆలయాల్లో పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం, భీమవరం గ్రామాల్లోని శ్రీ సాయి బాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు శ్రీసాయి బాబాను దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

కల్లూరు రూరల్: కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బత్తులపల్లి సెక్టారులో పోషకాహార విలువలపై హైస్కూల్ విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఐసీడీఎస్ ఏసీడీపీఓ రత్తమ్మ, హెచ్ఎం పాకాల రమేష్ బహుమతులు అందజేశారు. సూపర్‌వైజర్ భవాని, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు

కల్లూరు రూరల్: డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, సింగరేణి కాలరీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ గుండ్రా రమేష్ ఆర్టీసీలో దివ్యాంగులకు రాయితీతో అందించే పాస్‌లను గురువారం అందజేశారు. మండల పరిధిలోని చిన్న కోరుకొండి గ్రామ పంచాయతీలో సర్పంచ్ నామారాధమ్మ అధ్యక్షతన దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించారు. సిబ్బంది ఆనందరావు, శాంసన్, నామా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నృత్య శిక్షణ ప్రారంభం

సత్తుపల్లిరూరల్: పట్టణంలో స్టెప్ అఫ్ డ్యాన్స్ స్కూల్, చైతన్య టెక్నోస్కూల్ ఆధ్వర్యంలో గురువారం సమ్మర్ డ్యాన్స్ శిక్షణా కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ వై.మురళీకృష్ణ ప్రారంభించారు. డ్యాన్స్ మాస్టర్ కిన్నెర మణి, శ్రీను, తమ్మిశెట్టి గణేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు. తెలంగాణ తెలంగాణ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తుపల్లి డివిజన్ నృత్య కళాకారుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 25వ తేదీన సత్తుపల్లిలో నిర్వహిస్తున్నట్లు డ్యాన్స్ మాస్టర్ కిన్నెర మణి తెలిపారు.

గోకవరంలో 'కంటివెలుగు'

కల్లూరు రూరల్: మండలంలోని గోకవరం గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ గుగులోతు పెద్ద లచ్చిరాం ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ నవ్యకాంత్, ఎంపీఓ వీరస్వామి, ఉప సర్పంచ్ రామారావు, ఎంపీటీసీ రుక్మిణి, డాక్టర్ మహేశ్వరరావు, సిబ్బంది సదానందం, రామారావు, రాజేష్, అనిత, జీపీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల సంగ్రామ పాదయాత్ర ప్రారంభం

సత్తుపల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణ సాధన డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న మాదిగల సంగ్రామ పాదయాత్రను గురువారం సత్తుపల్లి మండలం రామానగరం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంఎస్సీ జిల్లా నాయకులు దారెల్లి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... ఏప్రిల్ 4న హైద్రాబాద్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పాదయాత్ర చేస్తున్నామన్నారు. జిల్లా నాయకులు జె.వెంకటేశ్వర్లు, జి.ముత్తారావు, కె.ఏసు, ఎమ్మార్పీఎస్ నాయకులు గోళ్లమూడి శ్రీనివాసరావు, పరిగడుపు లక్ష్మణ్, జనపాటి అశోక్, సింగపోగు రాంబాబు, తాళ్ల అర్జున్, కనకపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

జల గోస మొదలైంది!

- సత్తుపల్లిలోని పలు కాలనీల్లో నీటి ఎద్దడి
- ఈనెల 13 నుంచి నిలిచిన 'భగీరథ' నల్లాలు
- ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న మున్సిపాలిటీ



జంగాల కాలనీలో ట్యాంకర్లతో నీటి సరఫరా..

సత్తుపల్లిటౌన్: ఇంకా ఎండలు ముదరకముందే సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. సింగరేణి బొగ్గు గనుల తవ్వకాలతో ఏటేటా ఇక్కడ భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో పట్టణంలోని పలు కాలనీల్లో 150 నుంచి 300 అడుగుల లోతులో బోరు వేస్తే తప్ప నీళ్లు పడడం లేదు. కొన్ని ప్రాంతాలలైతే 300 అడుగులు బోర్లు వేసినా నీళ్లు పడని పరిస్థితి నెలకొంది. ఇక ఇప్పుడు ఎండాకాలం మొదలైంది. ఆయా కాలనీల్లో తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. పట్టణంలోని జంగాల కాలనీ, కాల్వొడ్డు కొత్తకాలనీ, గాంధీనగర్, ఎన్టీఆర్ నగర్‌లలోని సుబ్రమణేశ్వరస్వామి ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఆయా ప్రాంతాలకు మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేసే ట్యాంకర్ నీరే దిక్కవుతోంది. కాగా, కాలనీల్లో రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళిక రూపొందించినట్లు మున్సిపల్ యంత్రాంగం చెబుతోంది.

ట్యాంకర్ల ద్వారా సరఫరా

పట్టణంలోని 23 వార్డుల్లో సుమారు 50వేల జనాభా, 8,500 వరకు కుటుంబాలు ఉన్నాయి. వీరికి ప్రతిరోజు 5 మిలియన్ లీటర్ల నీటిని అందించాల్సి ఉంది. మిషన్ భగీరథ నీటితో పాటు పట్టణంలోని 32 మున్సిపల్ బోర్లతో నీటి సరఫరా జరుగుతోంది. అయితే ఈనెల 13వ తేదీ నుంచి సత్తుపల్లి మున్సిపాలిటీకి సాంకేతిక కారణాలతో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పట్టణంలోని మున్సిపాలిటీకి చెందిన 12 మోటార్లను 24 గంటలూ ఆడిస్తూ ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులకు నీళ్లు ఎక్కించి నల్లాల ద్వారా సరఫరా చేస్తున్నారు. పైపులైన్ లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు పంపిస్తున్నారు. అయితే, ట్యాంకర్లు నాలుగైదు రోజులకోసారి వస్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు నీటి కోసం అగచాట్లు పడుతున్నారు. ఎన్టీఆర్ నగర్, గాంధీ నగర్ ప్రాంతాలలో తక్కువ సమయం నీటి సరఫరా జరుగుతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకొని నీటిని పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని కోరుతున్నారు.



డ్రమ్ములు, పాత్రల్లో నిల్వ చేసిన నీరు

పంపులు రావడం లేదు..



చాలా రోజుల నుంచి ఇంట్లో పంపులు రావడం లేదు. ఇంటి పన్ను, నీళ్ల పన్ను కడుతున్నాం . ట్యాంకర్‌తో నాలుగైదు రోజులకోసారి నీటిని పోస్తున్నారు. ఇవి కుటుంబానికి ఏ మాత్రం సరిపోవటం లేదు. మిషన్ భగీరథ నీళ్లు ఇస్తామంటున్నారు కానీ ఇంకా రావటం లేదు.

– ఎస్.పార్వతి, జంగాల కాలనీ, సత్తుపల్లి

ట్యాంకర్ వస్తేనే నీళ్లు..



ఎండాకాలం కావటంతో నీళ్ల కోసం ఇబ్బంది పడుతున్నాం. ట్యాంకర్ వస్తేనే మాకు నీళ్లు. చేతిపంపు ఉన్నా బురదగా వస్తున్నాయి. రెండుమూడు బజార్లు దాటి వెళ్లి బోర్ల వద్ద నీళ్లు మోసుకొచ్చుకోవాల్సి వస్తోంది. చాలా కాలం నుంచి మేమంతా నీళ్ల కోసం ఇబ్బంది పడుతున్నాం.

– కె.వెంకటలక్ష్మి, సత్తుపల్లి

నీటి ఎద్దడి రాకుండా చర్యలు..



పట్టణంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. సమ్మర్ యాక్షన్‌ప్లాన్ రూపొందించాం. ప్రస్తుతం నాలుగు మున్సిపల్ వాటర్ ట్యాంకర్లతో కాలనీకు నీరు అందిస్తున్నాం. వేసవిలో మరో మూడు ట్యాంకర్లు అద్దెకు తీసుకుని ఇబ్బంది రాకుండా సరఫరా చేస్తాం.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



మధిర: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మధిర: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని 13వ వార్డు కౌన్సిలర్ బిక్కి అనిత సూచించారు. గురువారం మధిర ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని 4వ అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ జ్యోతి కుమారి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, మెప్మా ఆర్పీ రోజా, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సత్తుపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కొండమ్మ అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోషణ్ పక్షోత్సవాలు నిర్వహించారు. జెడ్పీటీసీ మారోజు సుమలత, సూపర్‌వైజర్లు భవాని, సుజాత, కమల పాల్గొన్నారు.

ఏన్కూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోరా బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సిర్రా రుక్మిణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, అరుణ, పద్మ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గురుకుల పాఠశాలలో నిర్వహించిన పోషణ్ మాసోత్సవ కార్యక్రమంలో చిరుధాన్యాల లాభాలు, పౌష్టికాహారం గురించి వివరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ధనమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.మాలతికుమారి, బీజాన్‌బీ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మోసపూరితమైన హామీలతో అధికారంలోకి..



కల్లూరు రూరల్: డిక్లరేషన్ అందజేస్తున్న సంభాని

కల్లూరు రూరల్: పేదల బతుకులు మారాలంటే కాంగ్రెస్ పాలనరావాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఓబుల్‌రావుపురంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి తరువాత ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రశేఖరశర్మ, హుస్సైన్‌నాయక్, లింగపోగుకృష్ణ, నరేంద్ర, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

26న వైరాకు హాథ్ సే హాథ్ జోడో యాత్ర..

ఏన్కూరు: ఈ నెల 26న వైరా చేరనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రను జయప్రదం చేయాలని టీపీసీసీ సభ్యుడు ధారవత్ రామ్మూర్తి నాయక్ కోరారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి చేపట్టిన జోడోయాత్ర విజయవంతం చేసేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానుకొండ రాధాకిషోర్, సున్నా రామకృష్ణ, సూరంపల్లి రామారావు, పోటు లెనిన్, ఉప్పెర్ల ఆనందప్రసాద్, తాళ్లూరి నర్సింహారావు, మాళోతు నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి



మధిర: నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



సత్తుపల్లి: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



కారేపల్లిలో..

మధిర: భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో యువత, విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు యంగల ఉజ్వల్ చరణ్ పిలుపునిచ్చారు. గురువారం భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా పట్టణంలోని భగత్‌సింగ్ సెంటర్‌లో ఉన్న సర్దార్ భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు జీవన్, సుధీర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి: యువత భగత్‌సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఎ.శరత్ పిలుపు నిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిత్రపటాలకు సత్తుపల్లిలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ పట్టణ కార్యదర్శి కె.రమ్య, అహల్య, రాజేశ్వరీ, కావ్య, భవాని, దీపిక, సుస్మిత పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని పినపాక గ్రామంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఎస్‌కె.లాల్‌మియా, ఎస్‌కె.మోదీన్సా, ఆనందరావు, పుల్లయ్య, జలీల్, ఏసోబు, జగన్, లక్ష్మయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

కారేపల్లి: కారేపల్లిలో పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ రాకేష్, నాయకులు ప్రవీణ్, ప్రశాంత్, రాజు, సుమన్, సందీప్, గణేష్, మహేష్, హేమంత్ పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



గొందుగూడెం జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కారేపల్లి: మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో పోలేరమ్మ జాతర సందర్భంగా ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. ఫైనల్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గొందుగూడెం జట్టు, ఖమ్మం జిల్లా పుఠాన్‌తండా జట్టు హోరాహోరీగా పోటీ పడగా గొందుగూడెం విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.20వేలు, షీల్డును శశి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత దమ్మాలపాటి శ్రీనివాసరావు అందజేయగా, రన్నరప్‌గా నిలిచిన పుఠాన్‌తండా జట్టుకు రూ.16 వేలు పాకలపాటి దామోదర్ అందజేశారు. మూడో స్థానంలోని కొమ్ముగూడెం జట్టుకు రూ.12 వేలు చీమల నాగేంద్ర బాబు, నాల్గో స్థానంలోని బర్లగూడెం జట్టుకు రూ.8 వేలు ఈసం రాజు, కన్సొలేషన్ బహుమతికి ఎంపికైన వరంగల్ జిల్లా అశోక్‌నగర్ జట్టుకు రూ.5 వేలు కేసగాని రామ్మూర్తిలు అందజేశారు. హైదరాబాద్ సీఐ కల్తి రాంబ్రహ్మం, సర్పంచ్ కల్తి భద్రమ్మ, ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి బండ రాంబాబు, నిర్వాహకులు వర్స శేఖర్, కల్తి కిరణ్, ముక్తి రాము, లక్ష్మణ్, అంజి, కార్తీక్ పాల్గొన్నారు.

కోటమైసమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కారేపల్లి: మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ కోటమైసమ్మ తల్లి హ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు అర్చకులు కొత్తలంక కైలాసశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వారాహి ప్రాజెక్టు హైదరాబాద్, రావూస్ మల్టి స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ఇల్లందు వారిచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్మాట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభి రామారావు, వారాహి ప్రాజెక్టు ప్రతినిధి మిర్యాల చంద్రమోహన్, రావూస్ హాస్పిటల్ వైద్యులు రవికుమార్, సిబ్బంది మూడ్ మోహన్‌చౌహాన్, సాయి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి తిరునాళ్లు..



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సత్తుపల్లిటౌన్: అయ్యగారిపేట పెద్దమ్మతల్లి తిరునాళ్లు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పుర వీధుల్లో అమ్మవారిని ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కాసిన రాజులు, పుచ్చా వెంకటేశ్వరరావు, పుల్లారావు, శ్రీను, కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో 'సెర్ప్' ముఖ్యపాత్ర



ఎమ్మెల్యే సండ్రను సత్కరిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న సెర్ప్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తెలంగాణ ప్రభుత్వం గుర్తిస్తూ జీఓ విడుదల చేయడంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవరగలోని సెర్ప్ ఉద్యోగులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెర్ప్ ఉద్యోగులు ఎంతగానో కష్టపడుతూ ధాన్యం కొనుగోళ్లల్లో ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. మిర్చి, మామిడి, మొక్కజొన్న కొనుగోళ్లలో కూడా స్వయం సహాయక సంఘాలు రాణిస్తున్నాయన్నారు. అనంతరం సెర్ప్ ఉద్యోగులు గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అలేఖ్య, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఉద్యోగులు అపర్ణ, ఎస్తేర్, శ్యామల, వాణి, రాజ్యలక్ష్మి, సుభద్ర, నాగమణి, భద్రమ్మ, సుందర్‌రావు, నర్సింహారావు, సుబ్బారావు, ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి దేశ సంపద'



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

చింతకాని: ప్రజా సమస్యలను గాలికొదిలేసి మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తెలిపారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో గురువారం జరిగిన జనచైతన్య యాత్రలో సుదర్శన్ మాట్లాడారు. మోదీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ పేద ప్రజలపై భారాన్ని మోపుతున్నారన్నారు. ఈ యాత్రకు జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, వైఎస్ ఎంపీపీ గురిజాల హనుమంతురావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట్రామయ్య, ఏఎంసీ డైరెక్టర్ వంకాయలపాటి లచ్చయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, నాయకులు ఏపూరి రవీంద్రబాబు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు సంఘీభావం తెలిపారు. యాత్రకు గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలకగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు వెంకట్, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, బండి పద్మ, మండల కార్యదర్శి మడుపల్లి భాస్కర్, వత్సవాయి జానికిరాములు, తోటకూరి వెంకటనర్సయ్య, బల్లి వీరయ్య, రవి, మద్దిని బస్వయ్య, రాము, సుబ్బారావు, ఎంపీటీసీ మునుకుంట్ల నాగరత్నం, ఉప సర్పంచ్ వినోద పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో గుర్తింపు సాధించాలి



ఏన్కూరు: సర్పంచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం



వైరారూరల్: సన్మానం పొందిన సర్పంచ్‌లు



కొణిజర్లలో..

ఏన్కూరు: మండలంలోని పంచాయతీలు అన్ని విభాగాల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎన్నిక కావాలని ఎంపీపీ అరెం వరలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఉత్తమ పంచాయతీలకు గురువారం ప్రశంశ పత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ బాదావత్ బుజ్జి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్ పాల్గొన్నారు.

కొణిజర్ల: జాతీయ పంచాయతీ అవార్డుల్లో వివిధ విభాగాల్లో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మానం చేసి ప్రసంశా పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ రుమావత్ రమాదేవి, ఎంపీఓ పటోళ్ల ప్రభాకర్‌రెడి, పంచాయతీ రాజ్ ఏఈ రమేష్, ఐకేపీ ఏపీఎం సుశీల సిబ్బంది పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని 14 జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులను సన్మానించారు. గురువారం రైతు వేదికలో సర్పంచులకు అభినందన సభలో సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేల్పుల పావని, ఎంపీడీఓ కె. శ్రీదేవి, ఎంపీఓ జ్యోత్స్నదేవి, ఏఎంసీ చైర్మన్ బీడీకే రత్నం, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు షేక్. లాల్ మహ్మద్, రైతుబంధు మండల కన్వీనర్ యరమాల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్త జనం

- వైభవంగా నాభిశిల ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠాపన



తల్లాడ: ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కొణిజర్ల: వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ..

తల్లాడ: మండలంలోని పాత మిట్టపల్లి గ్రామంలో గురువారం మల్లిఖార్జున స్వామి ఆలయం వద్ద శిలా ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ, ముత్యాలమ్మ, నాభిశిల ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. బ్రహ్మశ్రీ కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు విగ్రహ యంత్ర ప్రతిష్ఠాపన, శిలా ధ్వజ స్థంభ ప్రతిష్ఠ, ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ..

కొణిజర్ల: మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో గ్రామానికి చెందిన సల్లోజు దామోదరాచారి, కళావతి దంపతులు వితరణ చేసిన వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ, సిద్ధయ్య విగ్రహాలను స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామంలో విశ్వ బ్రాహ్మణులు , స్థానికులు విగ్రహాలను ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నాయకుల ముందస్తు అరెస్టు

సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనలో భాగంగా బీజేపీ నాయకులను గురువారం పోలీసులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లకుండా అరెస్ట్ చేయడం సరికాదన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు



సత్తుపల్లి: పోలీస్‌స్టేషన్‌లో నాయకులు



మధిర: పోలీసుల అదుపులో నాయకులు